
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
శనివారం 28 సెప్టెంబరు 2024
జిల్లాల వార్తలు





చర్చి ప్రధాన ద్వారం వద్ద కిక్కిరిసిన భక్తులు

ఘనంగా సీఎస్ఐ ఆవిర్భావ దినోత్సవం



చర్చి ఆవరణలో కోలాటం ఆడుతున్న మహిళలు



దైవసందేశం వినిపిస్తున్న బిషప్ డాక్టర్.కె.రూబెన్ మార్క్

- ఏసు మార్గంలో నడిస్తే ప్రపంచ శాంతి
- దైవ సందేశంలో బిషప్ డాక్టర్.కె.రూబెన్ మార్క్
- మిషన్ హాస్పిటల్ సేవలు ప్రారంభం

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 27 : ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి ఆఫ్ సౌత్ ఇండియా సంఘం(సీఎస్ఐ) 78వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో డయాసిస్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మెదక్ డయాసిస్ బిషప్ రెవరెండ్ డాక్టర్ కె.రూబెన్‌మార్క్ దైవ సందేశం అందించారు. ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెదలాలని, ఏసు చూపిన మార్గంలో నడిచినట్లయితే ప్రపంచంలో శాంతి నెలకొంటుందన్నారు. పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో మళ్లీ ఇన్నాళ్లకు మిషన్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ రోజు సీఎస్ఐ ఆవిర్భావంతో పాటు మహిళల మైత్రి సమాఖ్య 76 ఏళ్లు పూర్తి చేసుకున్నదని, మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహాలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. మహిళలు ఉత్సాహంగా కోలాటం ఆడారు. చర్చి నుంచి మెదక్ చౌరస్తా వరకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. చర్చికి అనుబంధంగా సేవలు అందించిన మిషన్ ఆస్పత్రి గతంలో మూతపడగా, కొత్త భవనాలను నిర్మించి మళ్లీ ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చారు. బిషప్ డాక్టర్ కె.రూబెన్‌మార్క్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రెడ్డి ఆస్పత్రిని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రెసిబిటేరీ ఇన్‌చార్జి శాంతయ్య, మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, మత గురువులు, చర్చి కమిటీ సభ్యులు సంపత్, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల పంజా

ఈ సీజన్‌లో 375 డెంగ్యూ, 659 టైఫాయిడ్ కేసులు



సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 27 : ఇటీవల వర్షాలతో పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి డెంగ్యూ కారక దోమల వృద్ధికి ఊతంగా మారింది. ప్రస్తుతం వర్షాలు తెరిపినివ్వడంతో నిల్వ నీటిలో దోమలు పెరిగి డెంగ్యూ జ్వరాలు పడగ విప్పుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో ఈ సీజన్‌లో 375 డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఇక 659 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పారిశుధ్య నిర్వహణ అధ్వానం

పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పట్టణాలు, పల్లెల్లో నిర్వహణ అధ్వానంగా ఉండడంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఫలితంగా ప్రజలు డెంగ్యూ టైఫాయిడ్ జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారు. వీటితో పాటు చికున్‌గున్యా కేసులు నమోదవుతున్నా ఆరోగ్య శాఖ అధికారికంగా ప్రకటించకపోవడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా ప్రతీ శుక్రవారం నిర్వహిస్తున్న ఫ్రైడే-డ్రైడే తూతూమంత్రంగానే కొనసాగుతుందని విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రైవేటులో సీజనల్ దందా !

ప్రైవేటు ఆస్పత్రుల్లో సీజనల్ దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా కొనసాగుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఏలీసా పరీక్ష చేయకుండానే డెంగ్యూ నిర్ధారణ చేయడం ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. ఆ ఒక్క ఆస్పత్రిలోనే కాకుండా జిల్లాలోని చాలా ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏలీసా పరీక్ష చేయకుండానే డెంగ్యూ నిర్ధారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయినా వైద్య ఆరోగ్య శాఖ మాత్రం తనిఖీల పేరిట హడావిడి చేసి చేతులు దులుపుకుంటున్నదనే ఆరోపణలున్నాయి. కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించకుండా వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నా..ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడం విమర్శలకు తావిస్తున్నది.

జ్వరంతో ఏడేళ్ల చిన్నారి మృతి



తనుశ్రీ(ఫైల్)

నిజాంపేట, సెప్టెంబరు 27 : జ్వరంతో బాధపడుతున్న ఏడేళ్ల చిన్నారి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందిన సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకున్నది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన బొమ్మెర కనకరాజు కుమార్తె తనుశ్రీ(7)కి రెండు రోజుల క్రితం తీవ్ర జ్వరంతో ఫిట్స్ వచ్చాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా శుక్రవారం రోజున మృతిచెందింది.



గౌడిచర్లలో పేదలకు ఇచ్చిన భూమి

పేదల స్థలాలకు ఎసరు!

- గౌడిచెర్లలో 4.03 ఎకరాలపై కన్ను
- 1976లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి ఇళ్ల పట్టాల అందజేత
- ధరణిలో పేరు మార్పించి దక్కించుకునే యత్నం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 27 : దాదాపు ఐదు దశాబ్దాల క్రితం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేసిన స్థలాలనే కాజేయాలని చూస్తున్నారు. భూములకు అంతగా విలువలేని నాటి కాలంలో నామమాత్రపు ధరకు అమ్ముకోగా, నేడు కోట్ల రూపాయల పలుకుతున్నాయి. దీంతో రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై భూమిని దక్కించుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. దీని కోసం గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌ను ఆసరాగా చేసుకుని పేదల పట్టాలిచ్చిన ఈ భూములకు ఎసరు పెట్టారు.

50 మందికి ఇళ్ల పట్టాలు



పట్టా సర్టిఫికెట్

సంగారెడ్డి మండలం గౌడిచెర్ల గ్రామంలో సర్వే నంబర్ 653లో 4.03 ఎకరాల భూమిని 1976లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒకరి వద్ద కొనుగోలు చేసి 50 మంది పేదలకు ఇళ్ల పట్టాలను అప్పటి ప్రభుత్వం అందజేసింది. ఆ స్థలంలో కొందరు ఇళ్లను నిర్మించుకుని నివాసముంటుండగా మరికొందరు పూరి గుడిసెలు వేసుకున్నారు. ఇంకొందరు పశువుల కొట్టాలుగా వినియోగించుకుంటున్నారు.

పేరు మార్పించి.. పది గుంటలు విక్రయం

ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎకరా భూమి రూ.1.50 కోట్లు పలుకుతుంది. ఎస్సీ కార్పొరేషన్ ఎవరి వద్దనైతే భూమిని కొనుగోలు చేసిందో అతడే రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ధరణి వచ్చిన తరువాత తిరిగి ఆ భూమిని తన పేరున మార్చుకున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు వ్యక్తి అదే గ్రామానికి చెందిన మరొకరికి పది గుంటల భూమిని అమ్మి రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చాడు. కొనుగోలు చేసిన వ్యక్తి ఎక్స్‌కవేటర్ సహాయంతో చదను చేసే క్రమంలో పేదలు అడ్డుకున్నారు. ఈ స్థలాన్ని తాను కొనుగోలు చేశానని బాధితులతో వాగ్వాదానికి దిగడంతో అసలు విషయం బయటపడింది.

విచారణ జరపాలని ఆర్డీవో ఆదేశం

బాధితులు ఈ విషయాన్ని కేవీపీఎస్ (కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, మాజీ సర్పంచ్ నాగరాజు దృష్టికి తీసుకువెళ్లగా పేదలకు న్యాయం చేయాలని వారు ఆందోళన చేశారు. సంగారెడ్డి ఆర్డీవో రాజుకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని స్థానిక తహసీల్దార్ దేవదాస్‌ను ఆయన ఆదేశించారు.

పూరిగుడిసెలో ఉంటున్నాం



మాకు బతుకుదెరువు కోసం 40 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం భూమి ఇచ్చింది. కానీ ఇప్పుడు ఎవరో వచ్చి ఇది మా భూమి అంటూ దౌర్జన్యం చేస్తున్నారు. డబ్బులు లేక ఈ స్థలంలో ఇళ్లు కట్టుకోలేక పూరి గుడిసే వేసుకుని ఉంటున్నాం.

- బ్యాగరి బాలయ్య

మాకు న్యాయం చేయాలి



ఏళ్ల తరబడి లేనిది ఇప్పుడు మా భూమి అని జేసీబీలు పెట్టి తవ్వుతున్నారు. మాకు ఇచ్చిన భూమిని మేము కొన్నామని చెప్పి దౌర్జన్యం చేస్తున్నరు. రెవెన్యూ అధికారులు ధరణిలో మా పేర్లు లేవని వేరే వారి పేరు ఉందని చెబుతున్నారు. మాకు ఇచ్చిన పట్టాలు ఇప్పటికీ ఉన్నాయి. మాకు న్యాయం చేయాలి.

- చిన్న సామయ్య

రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఎస్సీ కార్పోరేషన్ ద్వారా కొనుగోలు చేసి పేదలకు పంచిన భూమిని ధరణి వచ్చిన తరువాత ఇతరుల పేరున ఎలా మారతాయి. దళితులకు న్యాయం జరిగే వరకు వారికి కేవీపీఎస్ అండగా నిలిచి పోరాడుతుంది. అవినీతికి పాల్పడి ధరణిలో ఇతరుల పేరున నమోదు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి.

- మాణిక్యం, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

రూ.9.01 కోట్ల ఎస్‌ఎఫ్‌సీ నిధులు విడుదల

కోహీర్, సెప్టెంబరు 27 : పల్లెల ప్రగతికి వెన్నుదన్నుగా నిలిచే స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఎస్‌ఎఫ్‌సీ) నిధులను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. రాష్ట్రంలోని 32 జిల్లాలకు రూ.162.13 కోట్లు మంజూరయ్యాయి. సంగారెడ్డి జిల్లాకు సంబంధించి రూ.9,01,59,573 విడుదలయ్యాయి. రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి నేరుగా వచ్చే ఈ నిధులను పల్లె ప్రగతి పనులకు ఉపయోగిస్తున్న ట్రాక్టర్ల ఈఎంఐ, పంచాయతీల కరెంట్ బిల్లులు, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో చేపట్టిన పనుల బిల్లులు, ఆయా పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల జీతాల చెల్లింపులకు ఖర్చు చేయనున్నారు.

పంచాయతీల ఖర్చుల వివరాలు

123 గ్రామ పంచాయతీల ట్రాక్టర్ల ఈఎంఐ	రూ.48,96,049
గ్రామ పంచాయతీల కరెంటు బిల్లులు	రూ.20,55,600
స్వచ్ఛదనం పచ్చదనం పనుల నిధులు	
50 వేల లోపు జనాభా ఉన్న గ్రామాలకు	రూ.2,93,00,000
75 వేల లోపు జనాభా ఉన్న గ్రామాలకు	రూ.41,25,000
లక్షలోపు జనాభా ఉన్న గ్రామాలకు	రూ.5,99,076
3,048 మల్టీపర్పస్ వర్కర్ల జీతాలకు	రూ.3,06,83,448

నల్లవాగు కబ్జాపై సర్వే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సదాశివపేట, సెప్టెంబరు 27: నల్లవాగును కబ్జా చేసిన ఓ వెంచర్‌లో, 65వ జాతీయ రహదారి పక్కన కొత్తగా వెలసిన ఓ హోటల్‌కు సంబంధించిన భూముల్లో శుక్రవారం సర్వే ప్రారంభించారు. 'వాగును కబ్జా చేసి హైవే రోడ్డును ముంచేశారు' శీర్షికన ఈ నెల పదో తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. సదాశివపేట మండలం నాగ్సాన్‌పల్లి గ్రామ పరిధిలో 65వ జాతీయ రహదారి పక్కన ఓ ప్రముఖ డెవలపర్స్ సంస్థ 65 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో నల్లవాగు వెడల్పును తగ్గించగా, ఓ హోటల్ వారు వాగును కబ్జా చేయడంతో వరద నీరు ఇటీవల జాతీయ రహదారిపై ప్రవహించిన విషయం తెలిసిందే. ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు చర్యలకు ఉపక్రమించాయి. తహసీల్దార్ కె.సరస్వతి సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దాపూర్, నాగ్సాన్‌పల్లి గ్రామాల పరిధిలోని నల్లవాగు బఫర్‌జోన్‌లో సర్వే పనులను ప్రారంభించామని తెలిపారు. సర్వే నంబర్లు 626, 627, 628లలో 65 ఎకరాల్లో విస్తీర్ణంలో ఓ రియల్ వ్యాపారి ఏర్పాటు చేసిన వెంచర్ నుంచి, హైవే రోడ్డుపై హోటల్ పక్కన నుంచి వెళ్తున్న నల్లవాగు పరిధిపై సర్వే చేశామని పేర్కొన్నారు. మరో మూడు రోజులు సర్వే కొనసాగుతుందన్నారు. అనంతరం కబ్జాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

బీవీఆర్ఐటీ బస్సులు ఎదురెదురుగా ఢీ

- ఒక బస్సు డ్రైవర్ మృతి
- మరో డ్రైవర్‌తో పాటు 20 మంది విద్యార్థులకు గాయాలు



ఎదురెదురుగా ఢీకొన్న బీవీఆర్ఐటీ కళాశాల బస్సులు



డ్రైవర్ నాగరాజు(ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబరు 27 : మెదక్ జిల్లా నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ బస్సు డ్రైవర్ మృతి చెందగా మరో డ్రైవర్‌తో పాటు 20 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రోడ్డుపై పట్టణ సమీపంలోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో చోటు చేసుకుంది. ఒక బస్సు హైదరాబాద్ నుంచి కళాశాలకు విద్యార్థులతో వెళ్తుండగా, మరో బస్సు విద్యార్థులను తీసుకురావడానికి నర్సాపూర్‌కు వస్తోంది. ఈ క్రమంలో పట్టణ సమీపంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద కళాశాలకు వెళ్తున్న బస్సు ముందు ఉన్న ఆటోను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న బస్సును బలంగా ఢీకొంది. దీంతో ఓ బస్సు డ్రైవర్ నాగరాజు(50) బస్సులో ఇరుక్కుని తీవ్రంగా గాయపడగా స్థానికులు బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. మరో బస్సు డ్రైవర్‌తో పాటు గాయపడిన విద్యార్థులను అంబులెన్స్‌లలో కళాశాల ఆసుపత్రితో పాటు నర్సాపూర్, సంగారెడ్డి సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. కొందరిని హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తరలించారు. బస్సులో మొత్తం 40 మంది విద్యార్థులు ఉండగా 20 మందికి గాయాలు అయ్యాయి. చనిపోయిన డ్రైవర్ నాగరాజు భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన రోడ్డుపై ఈ ప్రమాదం జరగడంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం తమ సిబ్బందితో వచ్చి క్రేన్ ద్వారా రెండు బస్సులను పక్కకు తీయించి ట్రాఫిక్ చక్కదిద్దారు.



జాడీమల్కాపూర్ జలపాతం వద్ద కలెక్టర్, అదనపు కలెక్టర్

ధరణి సమస్యలను పరిష్కరించాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి
- మొగుడంపల్లి మండలంలో సుడిగాలి పర్యటన

జహీరాబాద్, సెప్టెంబరు 27 : తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. శుక్రవారం ఆమె మొగుడంపల్లి మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మాట్లాడారు. ధరణి సమస్యలను పెండింగ్‌లో పెడితే తహసీల్దార్‌లే బాధ్యులన్నారు. ప్రతి సోమవారమూ ఎమ్మార్వో కార్యాలయాల్లో తప్పకుండా ప్రజావాణిని నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం గిరిజన గురుకుల బాలికల కళాశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని జాడిమల్కాపూర్ ఎత్తిపోతల, జలపాతాన్ని ఆమె సందర్శించారు. అనంతరం కర్ణాటకలోని గొట్టంకోటను సందర్శించి ప్రకృతి అందాలను చూశారు. ఆమె వెంట అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధూరి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పర్యాటక అభివృద్ధికి అవకాశం

- మెదక్ జిల్లాలో ఎన్నో ప్రాంతాలు ఉన్నాయి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 27 : జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయని, రాబోయే కాలంలో జిల్లాను పర్యాటక ఆకర్షణ ప్రాంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యాటక ప్రాముఖ్యత, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక విలువల గురించి అంతర్జాతీయంగా ప్రజలకు అవగాహన కల్పించే దిశగా టూరిజం డేను నిర్వహిస్తారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందుతూ వస్తోందన్నారు. ఎన్నో అందమైన ప్రదేశాలు, చారిత్రాత్మకం నిర్మాణాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. రానున్న రోజుల్లో పర్యాటక రంగానికి మంచి భవిష్యత్తు ఉందని, విద్యార్థులు ఈ రంగంపై పట్టు సాధించేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. జిల్లాలో ఏడుపాయల, చర్చి, తునికి నల్లపోచమ్మ వంటి దర్శనీయ స్థలాలతో పాటు మెదక్ ఖిల్లా, నర్సాపూర్ అర్బన్ పార్క్, పోచారం అభయారణ్యం, జింకల ప్రత్యుత్పత్తి కేంద్రం, పార్కు వంటి ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. వాటిని అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకులను విశేషంగా ఆకర్షించవచ్చన్నారు. అనంతరం పర్యాటక రంగంపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఫొటో గ్యాలరీని అధికారులతో కలిసి కలెక్టర్ తిలకించారు. అనంతరం ఫొటోగ్రాఫర్లను సర్టిఫికెట్, మెమొంటోతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా అటవీ అధికారి జోజో తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో కొండాపూర్ పంచాయతీ కార్యదర్శి

రూ.ఐదు వేలు లంచం తీసుకుంటుండగా చిక్కిన సెక్రెటరీ



ఏసీబీ పట్టుకున్న కార్యదర్శి షకీల్


కొండాపూర్, సెప్టెంబరు 27: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ కథనం మేరకు.. కొండాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి షకీల్ అదే గ్రామానికి చెందిన మాచేపల్లి అఫ్సర్ తన సోదరుడి పేరున ఉన్న ఇల్లు, విద్యుత్ కనెక్షన్ మార్పు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు పంచాయతీ కార్యదర్శి రూ.25 వేలు లంచం డిమాండ్ చేశాడు. చివరికి ఇద్దరి మధ్య రూ.7వేలకు ఒప్పందం కుదిరింది. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం అఫ్సర్ పంచాయతీ కార్యదర్శి షకీల్‌కు ఎంపీవో కార్యాలయం వద్ద రూ.5 వేల నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడిని నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ సబ్ ఇన్స్‌పెక్టర్లు రమేశ్, వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 27 : 2008 డీఎస్సీ అభ్యర్థులను ఎస్జీటీ కాంట్రాక్టు టీచర్లుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో 2008 డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 292 మంది అభ్యర్థులు ఉండగా, శుక్రవారం 132 మంది వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. శనివారం కూడా ప్రక్రియ కొనసాగనున్నది.



సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వచ్చిన అభ్యర్థులు





మద్యం విక్రయిస్తే రూ.10 వేలు జరిమానా

● బాగిర్తిపల్లి గ్రామస్థుల ప్రతిజ్ఞ

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 27 : చిన్నశంకరంపేట మండలంలోని బాగిర్తిపల్లి గ్రామంలో గ్రామస్థులు ఏకమై మద్య నిషేధం విధించారు. శుక్రవారం రాత్రి గ్రామస్తులంతా గ్రామ చావిడి వద్ద సమావేశమై మద్యం నిషేధంపై తీర్మానం చేశారు. ఎవరైన గ్రామంలో మద్యం అమ్మితే రూ.10 వేలు జరిమానా విధించాలని, దీనికి గ్రామస్థులందరం కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.





నిర్లక్ష్యంతో కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు!

● పట్టించుకోని ఉన్నతాధికారులు

● బాధ్యులపై చర్యలేవి?

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ హెచ్చరిస్తున్నా పలు సర్కిళ్ల అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ డిమాండ్ పెరిగిన సబ్‌స్టేషన్లలో కోట్ల రూపాయలతో కొత్తగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్‌శాఖ ఏర్పాటు చేస్తోంది. అయితే కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల (పీటీఆర్) నిర్వహణ సరిగా లేకపోవడంతో తరుచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంగారెడ్డి సర్కిల్ ఇస్నాపూర్ ఇండస్ట్రియల్ సబ్‌స్టేషన్-2లో నెలరోజుల క్రితం ఫీడర్లు తరుచూ ట్రిప్పయినా అవేవి పట్టించుకోకుండా పీటీఆర్ ఆన్‌చేయడంతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీనిపై కారణాలు గుర్తించి ఉన్నతస్థాయిలో రిపోర్టు అందచేయాల్సిన అధికారులు అవేవి పట్టించుకోలేదు. ఏ సబ్‌స్టేషన్‌లో అయినా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే దానిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి.. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి డబ్బులు తీసుకుని వారిని వదిలేశారనే ఆరోపణలున్నాయి. బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన డివిజన్, సబ్‌డివిజన్ అధికారులు కొంతమంది ఆర్టిజన్లు, లైన్‌మెన్లతో కలిసి ప్రైవేట్ కాంట్రాక్ట్ పనులు చేపడుతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా సంగారెడ్డి, మేడ్చల్, సరూర్‌నగర్, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలో కొంతమంది అధికారులు బినామీ పేర్లతో కాంట్రాక్టు పనులు చేపడుతున్నారనే ఫిర్యాదులు కార్పొరేట్ కార్యాలయానికి వస్తుండటంతో వాటిపై విద్యుత్‌శాఖ ప్రత్యేక దృష్టిసారించింది.

ప్రేమిస్తున్నానని మోసం

● డబ్బులు, బంగారం దోచుకొని పెళ్లికి మొహం చాటు

● పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

తొగుట, సెప్టెంబరు 27 : ప్రేమిస్తున్నానని వెంటపడి... పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తొగుట ఎస్‌ఐ రవికాంత్ రావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన యువతితో తొగుట గ్రామానికి చెందిన చిలివేరి నరేష్‌గౌడ్ మూడేళ్లుగా ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన అతను యువతి వద్ద నుంచి ఆరు తులాల బంగారం, రూ.2,30,000 నగదును తీసుకున్నాడు. కాగా, కొన్ని రోజులుగా పెళ్లి చేసుకోమని యువతి కోరగా దాటవేస్తూ తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో మోసపోయనని గ్రహించిన యువతి కుటుంబీకులకు తెలుపగా శుక్రవారం వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట పోలీసులు తెలిపారు.

పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలి

● ఎంపీడీవో దామోదర్

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 27: పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యాలయాల వద్దకు ప్రజలు చేరుకోవాలని ఎంపీడీవో దామోదర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పౌరహక్కుల దినోత్సవంలో అన్ని కుల సంఘాలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

హత్యాయత్నం కేసులో దోషికి ఐదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 27 : హత్యాయత్నం కేసులో నేరం రుజువు కావడంతో దోషికి ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి ఎం.రాధాకృష్ణ చౌహాన్ శుక్రవారం తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీ రూపేష్ తెలిపిన వివరాల ప్రకారం.... కొండాపూర్ మండల కేంద్రానికి చెందిన మహ్మద్ మోసిన్ సంగారెడ్డి పట్టణంలోని కల్వకుంటకు చెందిన షేక్ సాబేర్ (30) ఇంటి వద్దకు 2018 అక్టోబరు 10వ తేదీన వెళ్లగా పదివేల రూపాయల అప్పు విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో మహ్మద్ మోసిన్‌పై షేక్ సాబేర్ గొడ్డలితో తలపై దాడి చేశాడు. ఈ మేరకు బాధితుడు మోసిన్ సంగారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ లక్ష్మారెడ్డి దర్యాప్తు చేసి కేసుకు సంబంధించి పూర్తి ఆధారాలను కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో దోషికి శిక్ష ఖరారు చేశారు. జరిమానా చెల్లించకుంటే మరో మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఓపెన్ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి

పాపన్నపేట, సెప్టెంబరు 27: చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని వీటిని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా పాపన్నపేట మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలవల్ల చదువును మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలకు హాజరై ఉత్తీర్ణత సాధించే అవకాశాలున్నాయన్నారు. ఈ పరీక్షలు రాయడానికి ఈ నెల 30 వ తేదీ వరకు ఫీజ్ చెల్లించవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ రియాజ్, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశం, అంజా గౌడ్, ప్రవీణ్, కృష్ణ కాంత్, యాదయ్య అనిల్, నరసింహులు, నింగప్ప, రమేష్, జాకీర, పద్మ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

కాళ్లకల్‌లో డీఎల్‌పీవో పర్యటన

● మురుగు నీటి కాలువ పరిశీలన

మనోహరాబాద్, సెప్టెంబరు 27: పొలంలోకి గ్రామ మురుగు నీరు రావడంతో పంట పాడవుతుందని కాళ్లకల్ గ్రామ రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తూప్రాన్ డీఎల్‌పీవో యాదయ్య, ఎంపీవో సతీష్ శుక్రవారం కాళ్లకల్ గ్రామంలోని రైతు పట్టపొలాన్ని, గ్రామంలోని పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. గ్రామ మురుగు నీరు పంట పొలంలోకి రాకుండా చూస్తామని రైతుకు తెలిపారు. అనంతరం గ్రామ పారిశుధ్యంపై కార్యదర్శి రాజును అడిగి తెలసుకున్నారు. గ్రామ పరిశుభ్రత పై దృష్టి పెట్టాలని అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాజు రైతు గ్రామస్థులు రామాచారి, ఇతరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రాహుకాల పూజ



మర్పడగ క్షేత్రం లో పూజలు చేస్తున్న భక్తులు

కొండపాక,సెప్టెంబరు 27: మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శుక్రవారం రాహుకాల పూజ క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయదుర్గా మాతకు విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఉదయం పది గంటల నుంచి ఒంటి గంట వరకు రాహుకాల పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు చీకోటి రాజేంద్రప్రసాద్, తిరుపతిరెడ్డి, మర్యాల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్ పట్టణంలోని అర్బన్ పార్కులో చివరి దశలో కాటేజీలు

అర్బన్ పార్కులో కాటేజీల సొమ్ము వృథానేనా..

గజ్వేల్ పట్టణంలో ఎంతో ఆర్భాటంగా నిర్మించిన కాటేజీలు రెండేళ్లు గడిచినా ప్రజలకు అందుబాటులోకి రాకపోవడంతో వృథాగానే ఉన్నాయి. రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన కాటేజీలు, డార్మిటరీ హాల్, గ్రీనరీ నిధులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. గత కలెక్టర్ పలుమార్లు కాటేజీలను సందర్శించినా సరిపడా నిధులు లేకపోవడంతో పనులు పూర్తిచేయలేదు. దీంతో కాటేజీల నిర్మాణానికి వెచ్చించిన ప్రజాధనం వృథాగా మారిందని చెప్పవచ్చు.


గజ్వేల్ పట్టణంలో వృథాగా మారిన ఆర్టీసీ బస్టాండ్

భవనాలున్నా.. వినియోగం సున్నా

రూ.కోట్లలో ప్రజాధనం వృథా

- నిరుపయోగంగా పలు ప్రభుత్వ భవనాలు
- శిథిలావస్థకు చేరుతున్నా పట్టించుకునే నాథుడే కరువు
- ఇప్పటికైనా ఉపయోగంలోకి తేవాలని కోరుతున్న ప్రజలు

గజ్వేల్, సెప్టెంబర్ 27: కోట్లాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు వృథాగా మిగిలిపోయాయి. గజ్వేల్ పట్టణంలో గత ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. కోట్ల రూపాయలతో నిర్మించిన అనేక భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ఇందులో చివరిదశలో ఉన్న భవనాలు కొన్నైతే, ప్రజలకు దూరంగా మరికొన్ని ఉండడంతో ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాయి. ఇతర ప్రభుత్వ అవసరాలకు సదరు భవనాలను వినియోగించాలన్న ధ్యాస కూడా ప్రస్తుత అధికారులకు లేకపోవడంతో రోజురోజుకూ శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

శిథిలావస్థ దిశగా ఆడిటోరియాలు

గజ్వేల్ పట్టణంలోని బాలబాలికల ఎడ్యుకేషన్ హబ్‌లలో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆడిటోరియాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. తుది దశలో ఉన్న వీటికి చివరి దశ బడ్జెట్ కేటాయిస్తే పూర్తయ్యే అవకాశం ఉన్నా.. అధికారులు ఆ దిశగా చొరవచూపకపోవడంతో రోజురోజుకూ పనికిరాకుండా పోతున్నాయి.


గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోని ఆడిటోరియం



సమీకృత భవనంలో పలు గదులు

గజ్వేల్ పట్టణంలోని సమీకృత భవన సముదాయంలో సైతం పలు కార్యాలయాల నిమిత్తం నిర్మించిన గదులు వృథాగా ఉన్నాయి. ఎ.బి.సి బ్లాకులుగా నిర్మించిన ఈ భవన సముదాయంలో బి బ్లాక్ మినహా ఏ, సీ బ్లాకులు నిరుపయోగంగా ఉంటున్నాయి. ఏ బ్లాక్ లో పోస్టాఫీస్ మినహా ఎటువంటి ఉపయోగం లేకపోగా, పంచాయతీరాజ్ ఈఈ ఆఫీసును ఇటీవల సీ బ్లాక్‌లో ఏర్పాటు చేశారు. రెండు సమావేశ మందిరాలు, ఇతరత్రా రూములు ఖాళీగానే ఉన్నాయి. ఇలా కోట్లాది రూపాయాల ప్రజాధనంలో నిర్మించిన భవనాలను వినియోగించకుండా ఉంచుతున్న అధికారులు.. గురుకులాలు, ఇతరత్రా భవనాలకు అద్దె చెల్లిస్తుండడంతో ప్రజాధనం అవుతున్నది. ఈ విషయమై కలెక్టర్ దృష్టి సారించి భవనాలను ఇతరత్రా అవసరాలకు వినియోగిస్తే ప్రయోజనం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

కుక్కలు, కోతులకు ఆవాసంగా ఐదు కోట్ల ఆర్టీసీ బస్టాండ్..

రూ.5 కోట్ల వ్యయంతో గజ్వేల్ పట్టణానికి కిలోమీటర్ దూరంలో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ వృథాగా మారిపోయింది. గత ప్రభుత్వం భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిర్మించగా పట్టణ విస్తీర్ణం పెరగకపోవడంతో ఎందుకు పనికిరాకుండా పోయింది. దీంతో కుక్కలు, కోతులకు ఆవాసంగా మారిపోయింది. బస్టాండ్‌లో లక్షలాది రూపాయలతో ఏర్పాటుచేసిన సీలింగ్ ఫ్యాన్లు, ఇతరత్రా విలువైన వస్తువులను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. బస్టాండ్ ఇతరత్రా అవసరాలకు వినియోగించుకుంటే దుర్వినియోగం కాకుండా చూడొచ్చు.

ఖాళీగా ఎంపీడీవో భవనం..

2009లో అప్పటి ప్రభుత్వం నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనం వృథాగా ఉంటుంది. సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఏర్పాటు చేయడంతో ఎంపీడీవో కార్యాలయాన్ని ఐవోసీలోకి తరలించారు. అప్పటినుంచి లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనం నిరుపయోగంగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి కార్యాలయ ప్రహరీ గోడ సైతం కూలిపోయింది.


గజ్వేల్ పట్టణంలో వృథాగా ఉన్న ఎంపీడీవో కార్యాలయ భవనం

రామగుండం విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కోకు కేటాయించాలి

- 1104 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్


నిరసన తెలుపుతున్న జల విద్యుత్ ఉద్యోగులు

పుల్‌కల్, సెప్టెంబరు 27: రామగుండంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించతలపెట్టిన థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కోకు కేటాయించాలని 1104 విద్యుత్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గా అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని సింగూరు ప్రాజెక్టు జల విద్యుత్ కేంద్రం వద్ద శుక్రవారం జెన్‌కో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సింగరేణి భాగస్వామ్యంతో రామగుండం విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని సూచించారు. వచ్చే నెల 6వ తేదీ వరకు వివిధ రూపాల్లో తాము నిరసన వ్యక్తం చేస్తామని యూనియన్ రీజినల్ అధ్యక్షుడు కలాలి చంద్రయ్యగౌడ్ తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పాండయ్య, యూనియన్ నాయకులు నాగరాజు, శ్రీనివాస్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల పనులు జరగనివ్వం

- కొనసాగుతున్న భూ నిర్వాసితుల ఆందోళనలు


టీజీఐఐసీ భూముల వద్ద భూనిర్వాసితులు ఆందోళన

వర్గల్, సెప్టెంబరు 27 : టీజీఐఐసీ కోసం గత ప్రభుత్వం సేకరించిన భూములకు సంబంధించి పూర్తి స్థాయిలో పరిహారం అందేవరకు పరిశ్రమల నిర్మాణ పనులు జరగనివ్వమని భూనిర్వాసితులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వర్గల్ టీజీఐఐసీ భూముల వద్ద భూనిర్వాసితులు చేస్తున్న ఆందోళన కార్యక్రమం శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారంతా అక్కడే వంట వార్పు చేసుకుంటూ పరిశ్రమలకు వెళ్లే దారిలో బైఠాయించారు. భూములు కోల్పోయిన రైతులందరికీ ఇండ్ల స్థలాలు ఇస్తామని చెప్పినా ఇప్పటికీ స్థలాలు చూపలేదన్నారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం జరగకపోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ఎకరాకు రూ. 18లక్షలతో పాటు పరిశ్రమల్లో ఉపాధి అవకాశం కల్పించాలన్నారు. భూ సేకరణలో అవకతవకలు జరిగాయిని వాటిని విచారించి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయ్యాలని డిమాండ్ చేశారు.

ఉచిత న్యాయ సహాయం పొందండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర


ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భవానీ చంద్ర

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 27 : అర్హత గల కక్షిదారులు న్యాయ సహాయాన్ని ఉచితంగా పొందాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర కోరారు. సంగారెడ్డిలోని జువైనల్ జస్టిస్ బోర్డులో న్యాయ సహాయ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఈ కేంద్రంలో ఒక న్యాయవాదితో పాటు పారా లీగల్ వలంటీర్ అందుబాటులో ఉంటారని, ఎవరికైనా న్యాయ సలహాలు అవసరముంటే సద్వినియోగం చేసుకోవాలన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డులో నిర్బంధించబడిన, నేరారోపణ చేయబడిన పిల్లలను తీసుకువస్తారని తెలిపారు. బాల్య నేరస్తులను సాధారణ క్రిమినల్ కోర్టుకు తరలించనందున ఇది వారికి ప్రత్యేక కోర్టుగా పనిచేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి శాలిని తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

జిన్నారం, సెప్టెంబరు 27: అండర్-19 అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 28నుంచి వరంగల్‌లో నిర్వహించే ఇంటర్ డిస్టిక్ అండర్-19 క్రికెట్ పోటీలకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు పాఠశాలకు చెందిన విద్యార్థి అంజి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రతాప్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ రాహుల్‌రాజ్


కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 27: స్వాతంత్ర్య సమరయోధుడు, మూడు తరాల తెలంగాణ పోరుబిడ్డ, ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బాపూజీ 109వ జయంతి సందర్భంగా శుక్రవారం వెనుకబడిన తరగతులు అభివృద్ధి శాఖ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని బాపూజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన చేసీ కృషి మరువలేనిదన్నారు. అంతకుముందు స్థానిక రాందాస్ చౌరస్తాలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి కలెక్టర్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, బీసీ అభివృద్ధి అధికారి నాగరాజ్‌గౌడ్, పద్మాశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాములు, బీసీ సంఘం అధ్యక్షుడు గంగారాం, నాయకులు సత్యనారాయణ, చెన్న రాంచంద్రం, సంతోష్ శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతిని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఏఈవోలపై డిజిటల్ పని ఒత్తిడి తగ్గించాలి

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్


సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 27: వ్యవసాయ విస్తరణ అధికారులపై అదనంగా డిజిటల్ క్రాప్ సర్వే పని భారం తగ్గించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక సంఘ భవనంలో ఏఈవోల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇదివరకే పంటల నమోదు కార్యక్రమాన్ని విజయంతంగా పూర్తి చేసి సాధారణ విధులు నిర్వహిస్తున్న ఏఈవోలకు అదనంగా డిజిటల్ క్రాప్ సర్వే పేరుతో వేల ఎకరాల భూములను సర్వే చేస్తూ ప్రతి సర్వే నెంబర్‌తోపాటు ప్రతి గుంట యాప్‌లో రికార్డు అయ్యే విధంగా అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేయడంతో ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఈవో అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్‌రెడ్డి ప్రశాంత్, టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు ఫజులొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

గీతం యూనివర్సిటీ హాస్టల్లో విద్యార్థిని ఆత్మహత్య


వర్ష (ఫైల్)

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబర్లు 27: రుద్రారం గీతం యూనివర్సిటీ విద్యార్థిని వర్సిటీ హాస్టల్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. సాటి విద్యార్థులు.. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన నాగళ్లి వర్ష (19) గీతం యూనివర్సిటీ బాలికల హాస్టల్‌లో ఉంటూ బీటెక్ సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకే కాలేజీకి వచ్చిన వర్ష 10 గంటల సమయంలో తిరిగి హాస్టల్‌కు చేరుకుంది. అనంతరం మరోసారి కాలేజీకి వెళ్లి మళ్లీ హాస్టల్‌కి వచ్చింది. ఏం జరిగిందో ఏమో కానీ తన గదిలో ఫ్యానుకు బెడ్ షీట్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హాస్టల్‌కి వచ్చిన రూమ్మేట్స్ చూసి వెంటనే వర్సిటీ యాజమాన్యానికి చెప్పడంతో వారు పటాన్‌చెరు పోలీసులకు సమాచారం అందించారు. పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి పూర్తి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే, ఆత్మహత్య చేసుకున్న వర్ష మొదటి నుంచి కొంత ముభావంగానే ఉంటుందని తోటి విద్యార్థులు చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీలోకి బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు

- ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో చేరిక..


ఎంపీ రఘునందన్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న ఉద్యమకారుడు మహేష్

మనోహరాబాద్, సెప్టెంబరు 27: మాజీ సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గమైన గజ్వేల్‌లో ఆ పార్టీ నేత ఒకరు బీజేపీలో చేరారు. మనోహరాబాద్ మండల బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, బీఆర్ఎస్ ఉద్యమకారుడు పురం మహేష్ శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఎంపీ ఇంట్లో జరిగిన కార్యక్రమంలో రఘునందన్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ప్రధాని మోదీ అభివృద్ధిని చూసి బీజేపీలో చేరుతున్నారన్నారు. పురం మహేష్ మాట్లాడుతూ ఉద్యమ కారులకు బీఆర్ఎస్‌లో గుర్తింపు లేదని, అందుకే బీజేపీలో చేరినట్లు చెప్పారు. అలాగే ముప్పిరెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, కాళ్లకల్ గ్రామ మాజీ అధ్యక్షుడు బాలు యాదవ్ చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్, బీజేపీ మండల అధ్యక్షుడు నరేందర్‌చారి, ముదిరాజ్ సంఘం నేత చంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, మల్లేష్, నాగరాజు, నర్సింహులు పాల్గొన్నారు.

గ్యాస్ రీఫిల్‌పై అధికారుల విచారణ

- ఎస్‌వీఆర్ గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల వినతి


అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దామరంచ గ్రామస్థులు


వెల్దుర్తి, సెప్టెంబరు 27 : మండల పరిధిలోని దామరంచ గ్రామంలో ఈ నెల 24న వెల్దుర్తి పట్టణానికి చెందిన ఎస్‌వీఆర్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది నిండు సిలిండర్ నుంచి ఖాళీ సిలిండర్‌లోకి రీఫిల్ చేస్తుండగా పట్టుబడిన ఘటనపై శుక్రవారం సివిల్ సప్లై ఉపతహసీల్దార్ ప్రణీతా రెడ్డి దామరంచ గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్యాస్ రీఫిల్ జరిగిన తీరును, ఖాళీ, నిండు గ్యాస్ సిలిండర్ల బరువు విషయాలను అడుగగా 30కిలోలు ఉండాల్సిన నిండు సిలిండర్ 4నుంచి 5కిలోలు తక్కువ రాగా, 15.6 కిలోలు ఉండాల్సిన ఖాళీ సిలిండర్ 18 నుంచి 19కిలోలు వచ్చిందని వివరించారు. అలాగే గ్రామానికి డెలివరీ చేయడానికి వచ్చిన ఏజెన్సీ సిబ్బంది సిలిండర్లను రోడ్లపై పెట్టి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, ఈవిషయమై ఏజెన్సీ నిర్వాకుడు శ్రీనివాస్‌రెడ్డికి చెప్పినా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు. నిర్వాహకులు, సిబ్బంది చేసిన అక్రమాలపై రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పూర్తి విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఉప తహసీల్దార్ తెలిపారు. ఈ విచారణలో ఆర్ఐ జయభరత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

చెరువులో పడి యువకుడి మృతి

తూప్రాన్, సెప్టెంబరు 27: చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు చెరువలో పడి మృతిచెందాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం తూప్రాన్ మండలం యావాపూర్ మాజీ సర్పంచు గోరిబీ మనవడు దూదేకుల అబ్దుల్ (26) గురువారం సాయంత్రం గ్రామంలోని పెద్దచెరువులో స్నానం చేసేందుకు వెళ్లాడు. చెరువులో స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి అందులో పడి మృతిచెందగా, రాత్రి సమయంలో గుర్తించారు. మృతుడు అబ్దుల్ భార్య సమ్రీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

ఇంతకు ప్రాసెస్‌లో ఉందా..!

- పత్తాలేని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులు
- ఐదేళ్లయినా ముందుకు సాగని వైనం
- గతంలోనే 600 ఎకరాల భూ సేకరణ సర్వే పూర్తి
- పూర్తిస్థాయిలో పరిహారంలో అదించడంలో ఆటంకాలు


కోహీర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన భూమి

కోహీర్, సెప్టెంబరు 27 : గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లకు ప్రాధాన్యత ఇచ్చేందుకు నిర్ణయించింది. అందులో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని కోహీర్, మునిపల్లి మండలాల్లోని వెంకటాపూర్, లింగంపల్లి గ్రామాల్లో ఆహార శుద్ధి పరిశ్రమలు(ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్) ఏర్పాటు కోసం నిర్ణయించింది. అంతేకాకుండా ఐదేళ్ల కిందటే ఆ ప్రభుత్వం అనుమతులు కూడా మంజూరు చేసింది. అయితే ప్రస్తుతం ఈ గ్రామాల్లో ఎలాంటి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులు జరుగడంలేదు. వీటి ఏర్పాటు కోసం మొత్తం 1200 ఎకరాల భూసేకరణ చేయాలని మొదట నిర్ణయించగా.. ఇరు గ్రామాల్లో మొదటి విడత కింద 600 ఎకరాల కోసం సర్వే పూర్తి చేశారు. ఆ సమయంలో రైతుల నుంచి వ్యతిరేకత ఎదురుకాగా, గ్రామ సభలతో రైతులకు రెవెన్యూ అధికారులు నచ్చజెప్పారు. కోహీర్ మండలంలోని వెంకటాపూర్ గ్రామ రైతులకు ఎకరానికి రూ.15 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని చెప్పగా.. 58 సర్వే నంబర్‌లోని 100 ఎకరాల భూమి గాను ఇటీవల పరిహారం చెల్లించారు. అలాగే మునిపల్లి మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులకు కూడా గతంలో పరిహారం చెల్లించారు. అయినా ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటు కోసం ప్రస్తుతానికి ఎలాంటి పనులు కనిపించడం లేదు. మొదట్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం హడావిడిగా భూ సర్వే చేసిన అధికారులు ప్రస్తుతం మాత్రం మిన్నకుండిపోయారు.

వివిధ కారణాలతో ముందుకు సాగని పనులు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం ప్రభుత్వం సేకరిస్తున్న భూ పరిహారం తక్కువగా ఉందని మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలా ఉంటే వెంకటాపూర్, లింగంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు కబ్జాలో ఉన్నప్పటికీని రికార్డుల్లో పేరు లేకపోవడంతో వారికి పరిహారం అందడం లేదు. రికార్డుల్లో పేరు ఉన్న రైతులు పొజిషన్‌లో లేకపోవడం కూడా అడ్డంకిగా మారింది. ఇలాంటి కారణాలతో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటు జరుగుతుందో లేదోనని పలువురు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భూసేకరణ సమయంలోనే రెవెన్యూ అధికారులు పొజిషన్‌లో ఉన్న, లేని రైతులను గుర్తించారు. అయితే కొంత మంది రైతులకు సర్టిఫికెట్లు ఉన్నాయి కానీ పొజిషన్‌లో లేరు. మరి కొంత మంది రైతులు పొజిషన్‌లో ఉన్నారు కానీ సర్టిఫికెట్లు లేవు ఇలాంటి వారి గురించి ప్రభుత్వం పరిహారం చెల్లించే విషయంలో ఆలోచిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఫుడ్ ప్రాసెసింగ్ ఏర్పాటులో మరింత జాప్యం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రికార్డు ప్రకారం పరిహారం చెల్లించాలి..



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం వెంకటాపూర్ గ్రామంలోని 58 సర్వే నంబర్‌లో భూసేకరణ చేస్తున్న రెవెన్యూ అధికారులు రైతుల పాస్ పుస్తకంలో ఎంత భూమి ఉంటే అంత పరిహారం రైతులకు చెల్లించాలి. చాలామంది రైతులకు భూమి ఎక్కువగా ఉన్నప్పటికీని సాగులో లేరని తక్కువ పరిహారం చెల్లించడం సరికాదు.

-సుదర్శన్, వెంకటాపూర్

పరిహారం చెల్లించడంలో ఆలస్యం..



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం రెవెన్యూ అధికారులుఎ చేపడుతున్న భూ సేకరణలో రైతులకు పరిహారం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు. మొదట చాలామంది రైతులకు తక్కువ పరిహారం చెల్లించారు. పట్టా పాస్ పుస్తకం ప్రకారం ప్రతీ ఒక్కరికి పూర్తి పరిహారాన్ని చెల్లించాలి.

-ప్రభాకర్, వెంకటాపూర్


సంగారెడ్డిలోని తారా కళాశాలలో కొండాలక్ష్మణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది


జిన్నారం: కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్ రోజారాణి, అధికారులు


నారాయణఖేడ్: మార్కండేయ భవన్‌లో కొండాలక్ష్మణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు


జహీరాబాద్: ఎంపీడీవో కార్యాలయంలో కొండాలక్ష్మణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు


పటాన్‌చెరు: కొండాలక్ష్మన్ బాపూజీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి కొండాలక్ష్మణ్ బాపూజీ

స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిన కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమాలను శుక్రవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా పార్టీలు, సంఘాల కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్లలో కొండాలక్ష్మణ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

● సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 27: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కొండా లక్ష్మణ్‌బాపూజీ అని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ కొనియాడారు. సంగారెడ్డిలోని తారా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎ్ ఎఎస్ విభాగాలు, సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.జగదీశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● జిన్నారం: బొల్లారం మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్ పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతాయారు, మేనేజర్ నిర్మలారెడ్డి, ఆర్వో నర్సింహులు, ఇతర సిబ్బందితో కలిసి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల

● నారాయణఖేడ్: ఖేడ్‌లో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఆచార్యకొండాలక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. క్యాంపు కార్యాలయంతో పాటు మార్కండేయ భవన్‌లో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కోహీర్: కోహీర్‌లోని తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది కొండాలక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాలశంకర్, డీటీ ప్రసాద్, గిర్దావర్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

● జహీరాబాద్: పట్టణంలోని ఎంపీడీవో, మున్సిపల్, తదితర కార్యాలయాల్లో కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పింపంచారు.ఆయా కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● పటాన్‌చెరు: పటాన్‌చెరులోని ఆచార్య కొండాలక్ష్మన్ బాపూజీ విగ్రహం వద్ద ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం బాపూజీ పదవులను త్యాగం చేసి చివరి శ్వాస వరకు తెలంగాణా వాదిగా పోరాటం చేశారని కొనియాడారు. బాపూజీ పోరాట స్ఫూర్తితో తెలంగాణా అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. బాపూజీకి నివాళులర్పించినవారిలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌కుమార్, కార్పోరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ విజయ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మెదక్ అర్బన్: రాందాస్ చౌరస్తాలో కొండా లక్ష్మణ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్ జిల్లాలో..

మెదక్ అర్బన్, సెప్టెంబరు 27: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మెదక్ పట్టణంలోని స్థానిక రాందాస్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● తూప్రాన్: పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపుజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ, వైస్‌చైర్మన్ నందాల శ్రీనివాస్, కౌన్సిలర్లు, పద్మశాలీ నాయకులు పాల్గొన్నారు.

● నిజాంపేట: మండల కేంద్రంలోని స్థానిక తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

● చిన్నశంకరంపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పద్మశాలీ సంఘం, ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో కొండా లక్షణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శశిధర్, మార్కండేయ మండలాధ్యక్షుడు తలకొక్కుల శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.


తూప్రాన్‌లో కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

● అల్లాదుర్గం: మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో కొండా లక్ష్మన్ బాపుజీ చిత్రపటానికి బీజేపీ జిల్లా నాయకులు కాళ్లరాములుతో పాటు పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

● పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్ కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన త్యాగనిరతిని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్ఐ శర్దప్ప, మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● రేగోడు: రేగోడు తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ నరేష్, ఆర్ఐ ఫిరోజ్, సిబ్బంది కొండాలక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలు

జిన్నారం, సెప్టెంబరు 27: గడ్డపోతారం ప్రధాన రహదారిపై ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం వాటర్ ట్యాంకర్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఎల్లమ్మ గుడి వద్ద రోడ్డుపై పెద్ద గుంతల కారణంగా అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతోనే స్త్రీలకు సంపూర్ణ ఆరోగ్యం

పటాన్‌చెరు, సెప్టెంబరు 27: సమతుల పౌష్టికాహారంతోనే స్త్రీలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పోషణ అభియాన్, పోషణ మాసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు, కిషోరబాలికల కోసం తయారు చేసే పౌష్టికాహార స్టాళ్లను ప్రారంభించారు. అనంతరం సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టుకుమార్‌యాదవ్, పుష్పానగేష్, డీసీ సురేష్‌కుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం డే క్విజ్‌లో రాంపూర్ విద్యార్థుల ప్రతిభ


క్విజ్ కాంపిటీషన్ విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్

నిజాంపేట, సెప్టెంబరు 27: వరల్డ్ టూరిజం డే సందర్భంగా శుక్రవారం మెదక్‌లో జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాణాగౌడ్, శశికుమార్, విజేతలుగా నిలిచారు వారికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఒరిస్సాలో లయన్స్ క్లబ్ సభ్యుల పర్యటన


ఒరిస్సాలో పర్యటిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి సభ్యులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 27: పర్యాటక పర్యటనలతో తమ పరిసరాలను వివిధ ప్రాంతాల పరిసరాలను పరిశీలించి తమ జీవితాలను అభివృద్ధి చేసుకునేందుకు తగిన పరిజ్ఞానం పొందవచ్చని లయన్స్‌క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ జోన్ చైర్మన్, ఒరిస్సా టూర్ ఆర్గనైజర్ మంగళపర్తి వెంకటేశం అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటకం-శాంతి నినాదంతో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ సంగారెడ్డి ఆదర్శ, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అమీన్‌పూర్ క్లబ్‌ల ట్విన్నింగ్ ప్రోగ్రాం కింద ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్, గిరిజాదేవి శక్తి పీఠం(జాజిపూర్), పూరి, కోణార్క్, తదితర ప్రాంతాల్లో పర్యటనకు తరలివెళ్లారు. కార్యక్రమంలో టూర్ ఆర్గనైజర వెంకటేశ, క్లబ్ కోశాధికారి శేషత్వం కృష్ణ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే కళలను అలవర్చుకోవాలి: మెదక్ డీఈవో

హవేళిఘణపూర్, సెప్టెంబరు 27: విద్యార్థి దశ నుంచే కళలను అలవర్చుకోవాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌రావు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల్లో మండలస్థాయి కళా ఉత్సవాల్లో విద్యార్థుల ప్రదర్శనలు పలువురిని అలరించాయి. అనంతరం పాఠశాల గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు.

ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజం: ఎంఈవో

పాపన్నపేట, సెప్టెంబరు 27: ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజమని ఎంఈవో ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు, మండల పరిధిలోని నరసింగరావు పల్లి గిరిజన తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన శైలజకు శుక్రవారం వీడుకోలు సమావేశం నిర్వహించారు. కాగా తాను పనిచేసిన నర్సింగరావుపల్లి గిరిజన తండా విద్యార్థులకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు శైలజ తమ సొంత నిధులతో ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిరంజీవి, కాంపెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కేసునమోదు చేయాలి

టేక్మాల్, సెప్టెంబరు 27: పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. మండల పరిధిలోని ఆయా గ్రామాల పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలతో టేక్మాల్ చౌరస్తా నుంచి పోలీస్ స్టేషన్ వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. అనంతరం దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ రేణుకకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రారంభమైన బొడ్డెమ్మ సంబరాలు

శివ్వంపేట, సెప్టెంబరు 27: పువ్వులను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగలో భాగంగా మొదటగా నిర్వహించే బొడ్డెమ్మ వేడుకలు శివ్వంపేట, చేగుంట, చిన్నశంకరంపేట మండలాల్లో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన శివ్వంపేటతో పాటు గోమారం, దొంతి, తదితర గ్రామాల్లో బాలికలు ఆవుపేడ, పువ్వులతో అలంకరించిన బొడ్డెమ్మలను వాకిట్లో పెట్టి లయబద్ధంగా తిరుగుతూ ఆడుతూ పాడుతూ బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.

పాఠశాలల సమయానికి బస్సులు నడపాలి

తూప్రాన్, సెప్టెంబరు 27: తూప్రాన్ డివిజన్ కేంద్రంలో చదువుకుంటున్న విద్యార్థులకు సరైన సమయంలో బస్సులు నడిపించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యుడు జగన్ పేర్కొన్నారు. శుక్రవారం తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్ కంట్రోలర్‌కు సమయానికి బస్సులు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. గజ్వేల్ నుంచి వచ్చే బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వెల్దుర్తి బస్సు కొద్దిరోజులుగా రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సంగారెడ్డి నుంచి వచ్చే బస్సులు సాయంత్రం వేళల్లో సమయానికి రాకపోవడంతో విద్యార్థులు రాత్రుల్లో ఇంటికి వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో దేశభక్తి

పాపన్నపేట, సెప్టెంబరు 27: ఎన్‌సీసీ వల్ల విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందడమే కాకుండా, క్రమశిక్షణ ఏర్పడుతుందని 33 (టీ) సంగారెడ్డి యూనిట్ ఆర్మీ కమాండింగ్ ఆఫీసర్ రమేష్ సరియల్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండల కేంద్రమైన పాపన్నపేట ఎన్‌సీసీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాపన్నపేట సీటీవో ప్రవీణ్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. దేశ సేవ చేయాలనుకున్న విద్యార్థులకు ఎన్‌సీసీ ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌సీసీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రిపబ్లిక్ డే క్యాంపునకు ఎంపిక అయ్యే అవకాశం ఉంటుందని, ఎన్‌సీసీ సర్టిఫికెట్లు ఉన్నత విద్యాభ్యాసానికి తోడ్పడతాయని తెలిపారు.

నేడు విద్యుత్ వినియోగదారుల ఫోరం సదస్సు

తూప్రాన్, సెప్టెంబరు 27: తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలో విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద ఈ నెల 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ వినియోగదారుల ఫోరం సదస్సు నిర్వహిస్తున్నట్లు డీఈ కే. రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

1న సదరం స్లాట్ బుకింగ్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 27 : దివ్యాంగులను గుర్తించే సదరం క్యాంపును వచ్చే నెల 7వ తేదీన సదరం శిబిరం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన స్లాట్లు 1వ తేదీ న కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించే క్యాంపునకు ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలన్నారు.

పీఆర్సీని అమలు చేయాలి: తపస్

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 27: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మిర్జాపల్లి, ధర్పల్లి, సూరారం, చందంపేట, రుద్రారం పాఠశాలలో తపస్ సభ్యత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా బాధ్యులు వై మాధవి, రఘుషా, అంజనేయులు, మహేష్, శ్రీహరి, మంగరాణి, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

తపస్ నూతన కార్యవర్గం

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 27: మండల తపస్(టీపీయూఎస్) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, చల్లా లక్ష్మణ్‌లు శుక్రవారం తెలిపారు. పెద్దశంకరంపేట మండల తపస్ అధ్యక్షుడిగా గుజ్జరి రవి, ప్రధాన కార్యదర్శిగా కాన్షీరాం జాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు వివరించారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీ

కోహీర్, సెప్టెంబరు 27: మండల కేంద్రంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ కోహీర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా ఎండీ బద్రుద్దీన్, ప్రధాన కార్యదర్శిగా ప్రసన్న, ఉపాధ్యక్షులుగా రజియోద్దీన్, వాసవి, కోశాధికారిగా వెంకటేశ్వరరాజు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా సీహెచ్ విఠల్, ఆడిట్ కార్యదర్శులుగా క్రాంతి, రాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలరాం అన్నపూర్ణ, అమీన్‌బీన్ సయ్యద్ తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో సేవాలాల్ దీక్షలు

పుల్‌కల్, సెప్టెంబరు 27: భవాని సేవాలాల్ దీక్షలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉమ్మడి పుల్కల్ మండలంలోని వివిధ గిరిజన తండాలకు చెందిన గిరిజనులు విజయదశమిని పురస్కరించుకుని జగదాంబ భవాని సేవాలాల్ మహారాజ్ దీక్షలు చేపట్టారు. ఈ నెల 17న దీక్షలు అత్యంత నియమ, నిష్టలతో ప్రారంభించారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

జిన్నారం, సెప్టెంబరు 27: బొల్లారం మున్సిపాలిటీలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నామని చైర్‌పర్సన్ రోజారాణి తెలిపారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 16, 17వ వార్డులలో 50లక్షల చొప్పున మొత్తం రూ. కోటి వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.

కాంగ్రెస్ పార్టీది చేతల ప్రభుత్వం: ఖేడ్ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, సెప్టెంబరు 27: కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగా మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో 48 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కంగ్టి మండలంలోని పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు దామర్ చెరువుకు చెందిన సంగయ్య విద్యుత్ షాక్‌తో మృతి చెందగా పరిహారం కింద మంజూరైన రూ.4.50 లక్షలకు సంబంధించిన చెక్కును మృతుడి భార్యకు అందజేశారు. అనంతరం ఆయన లబ్ధిదారులను ఉద్ధేశించి మాట్లాడుతూ- గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంలో వివక్ష చూపిందన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా, అర్హులైన వారందరికీ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, రాజేష్ చౌహాన్, సద్దాం, మండలకాంగ్రెస్ అధ్యక్షుడు తాహేర్ అలీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● కంగ్టి, సెప్టెంబరు 27: మండలపరిధిలోని తడ్కల్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చాప్టా.కెలో శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనాన్ని పరిశీలించారు. చాప్టా.బి లో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. అనంతరం సర్దార్ తండాలోని కాలూ బాబ ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణుసాగర్, డీటీ జుబేద్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, శివాజీపాటిల్, మాణిక్‌పాటిల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కంగ్టి: చాప్టా.కెలో శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


జహీరాబాద్: హుగ్గెల్లిలో పిచ్చిమొక్కలను తొలగిస్తున్న మండల ప్రత్యేకాధికారి భిక్షపతి తదితరులు


రేగోడులో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం

జహీరాబాద్/నారాయణఖేడ్, సెప్టెంబరు 27: పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో శుక్రవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలోని ప్రధాన వీధులతోపాటు, ప్రభుత్వపాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించి, పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామంలో జ్వరాల కోసం ఇంటింటి సర్వేలను కూడ నిర్వహించారు. మహీంద్రా కర్మాగారం ఆధ్వర్యంలో బీదర్‌చౌరస్తాలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఖేడ్ పట్టణంలోని రైతు బజార్ పరిసరాల్లో దట్టంగా పెరిగిన పొదలను శుక్రవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కార్మికులు తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, శానిటేషన్ అధికారి శ్రీనివాస్ స్వచ్ఛతపై స్థానికులకు అవగాహన కల్పించారు.

మెదక్ జిల్లాలో..

నర్సాపూర్/చిన్నశంకరంపేట/రేగోడు, సెప్టెంబరు 27: ప్లాస్టిక్ వాడకం వల్ల ఎన్నో అనర్థాలు వస్తున్నాయని వాటి వాడకం తగ్గించాలని, అలాగే పరిసరాలను ఎవరికివారు శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరముందని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల కళాశాలలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల పర్యావరణం దెబ్బతింటున్నదని, అందువల్ల ప్రజలు, విద్యార్థులు కూడా ప్లాస్టిక్ వాడకం తగ్గించేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ బలరాం, శానిటరీ సూపర్‌వైజర్ సల్లామురళి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, వార్డు అధికారులు పాల్గొన్నారు. చిన్నశంకరంపేట మండలంలోని రామాయిపల్లి గ్రామంలోని పుర వీధుల్లో శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ వెంకటయ్య పర్యటించి డ్రైనేజీలు, నివాసాలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. సీజన్ వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలతో పాటు, నీటి తొట్టీలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వెంట ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజారాణి, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు. రేగోడులో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఏపీజీ బ్యాంక్ మేనేజర్ రాజేష్ కుమార్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, ప్రోగ్రాం సిబ్బంది అజయ్ కుమార్ మహేశ్వర్ గౌడ్ పరిసరాలను శుభ్రం చేశారు.

మండల పరిషత్ రికార్డుల పరిశీలన

హవేళిఘణపూర్/టేక్మాల్, సెప్టెంబరు 27: హవేళీఘణపూర్, టేక్మాల్ మండల పరిషత్ కార్యాలయాలను శుక్రవారం జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. మండల పరిషత్ అధికారులు సమయ పాలన పాటించి విధులు నిర్వహించాలని, గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని సీఈవో ఆదేశించారు. వెంట ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు, అధికారులు


ఖేడ్ మండలం జూకల్ శివారులో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్ర వేత్తలు, అధికారులు

నారాయణఖేడ్/మనూరు, సెప్టెంబరు 27: ఖేడ్ మండలం జూకల్‌లో, మనూరు మండలం డోవూరులో సాగు చేస్తున్న వరి, పత్తి పంట పొలాలను శుక్రవారం ఏఆర్ఎస్ తోర్నాల్ శాస్త్రవేత్త శ్రీజయ, ఏరువాక కేంద్రం సమన్వయకర్త రాహుల్ విశ్వకర్మ, ఉద్యానవన శాస్త్రవేత్తలు సరిత, శ్వేత, ఖేడ్ ఏడీఏ నూతన్ కుమార్, ఏవోలు శంకర్, వెంకటేశం, ఆసియాబేగం, ఏఈవోలు రాందాస్, హరీష్, సతీష్, రఘునాథ్, సురేష్, సవిత సందర్శించారు. ఇటీవల భారీ వర్షాల వల్ల పంటలకు సోకిన తెగుళ్ల పరిశీలించి, వాటి నివారణకు అవసరమైన సూచనలు, సలహాలనిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈవోలు, రైతులు ఉన్నారు.

● అల్లాదుర్గం: మండలంలోని బహిరన్‌దిబ్బ గ్రామంలోని పత్తి పంటను వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు, మెదక్ జిల్లా అధికారులు శుక్రవారం పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. పంటలను పరిశీలించిన వారిలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, ప్రధాన శాస్త్రవేత్తలు బసంత్‌రావు, డాక్టర్ విజయ్ కుమార్, ఏరువాక కేంద్రం, తోర్నాల డాక్టర్ ఫాతిమా, శాస్త్రవేత్త బసంత్, డాక్టర్ సరిత, స్థానిక ఏవో. రాజేశ్ కుమార్, ఏఈవోలు తదితరులు ఉన్నారు.

● నర్సాపూర్: నర్సాపూర్ మండలం సీతారాంపూర్‌లోని ఓ రైతుకు చెందిన వరిపంటను శుక్రవారం వ్యవసాయశాఖ ఏడీఏ సంధ్యారాణి, ఏవో దీపిక తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వరిపంటకు కాండం కుళ్లు తెగులు ఆశించినట్లు గుర్తించి, దాని నివారణకు ప్రోపికొనజోల్ ఒక మిల్లీ లీటర్‌ను లీటరు నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు.

● రేగోడు: మండలంలో సాగు చేస్తున్న పత్తి, ఉల్లి పంటలకు వ్యవసాయాధికారులు సూచనల మేరకే రసాయన పిచికారి మందులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ప్యారారం గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, శాస్త్రవేత్తలతో కలసి పత్తి, ఉల్లి పంటలను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటలో ప్రతికూల పరిస్థితుల వల్ల పూతకాత రాలిపోవడం జరిగిందని, పత్తి లో రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువ ఉండడం గమనించి నివారణకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ఫాతిమా, డాక్టర్ సరిత, డాక్టర్ విజయ్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహణపై వివరాలను తెలుసుకుంటున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ప్రతీ పిటిషన్‌కు న్యాయం చేయాలి: మెదక్ ఎస్పీ


నర్సాపూర్, సెప్టెంబరు 27: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ పిటిషన్‌ను తీసుకుని వారికి తగిన న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి స్థానిక పోలీసు అధికారులకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, సైబర్ నేరాలపై ప్రజలలో అవగాహన కల్పించాలని పలు సూచనలు చేశారు. వెంట డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ లింగం తదితరులు ఉన్నారు.

హాస్టల్‌లో ఎంపీడీవో రాత్రి నిద్ర


చౌకన్‌పల్లి పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంపీడీవో సత్తయ్య

కంగ్టి, సెప్టెంబరు 27: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో గురువారం రాత్రి ఎంపీడీవో సత్తయ్య హాస్టల్‌లో నిద్ర చేపట్టారు. రాత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఆయన వారి సమస్యలు, అక్కడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు బీసీహాస్టల్‌ను తనిఖీ చేశారు. రెండు వసతి గృహాలకు ప్రహారీలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు తెలిపారు. శుక్రవారం బోర్గి, సర్దార్ తండాలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. చౌకన్‌పల్లిలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన వెంట రామప్ప, పండరీ, కార్యదర్శి సంతోష్ ఉన్నారు.

దాడులను ప్రోత్సహించే ఆనవాయితీ మాకు లేదు


గోమారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

శివ్వంపేట, సెప్టెంబరు 22: తగాదాలను, దాడులను ప్రోత్సహించే ఆనవాయితీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతరెడ్డిది కాదని, అక్రమ దందాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు ఇరువర్గాల ఘర్షణలో కేసులు పెట్టి యువకులను బలి చేశారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హనుమంత్‌రెడ్డి, యాదగౌడ్, ఆంజనేయులు, వీరేశం విమర్శించారు. ఘర్షణ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గోమారం గ్రామంలోని సునీతారెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశంలో హనుమంత్‌రెడ్డి, యాదగౌడ్, వీరేశం, ఆంజనేయులు మాట్లాడుతూ.. గోమారం గ్రామంలో వినాయక నిమజ్జనం సునీతరెడ్డి ఇంటి వైపు నుంచి తీసుకువచ్చే ఆనవాయితీ గతంలో లేదని ఈసారి నిమజ్జనంలో ఉద్దేశపూర్వకంగానే ఎమ్మెల్యే ఇంటి వైపు నిమజ్జన యాత్రను తీసుకువచ్చిన కాంగ్రెస్ నాయకులు ఘర్షణను ప్రేరేపించారని మండిపడ్డారు. గణపతుల నిమజ్జన వాహనం వెళ్లకుండా రోడ్డులో కార్లు అడ్డుగా పెట్టడంతోనే బాణాసంచాలు పేలిన సమయంలో కారుపై నిప్పురవ్వలు పడ్డాయే తప్ప కావాలని దాడులను ప్రోత్సహించే ఆనవాయితీ తమకు లేదన్నారు. సమావేశంలో నాయకులు భిక్షపతిరెడ్డి, అశోక్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీశైలం పాల్గొన్నారు.

పలు మండలాల్లో ఉచిత వైద్య శిబిరాలు

నిజాంపేట, సెప్టెంబరు 27: నిరుపేదలకు ఉచిత కంటి వైద్య శిబిరం ఎంతగానో ఉపయోగపడుతుందని మాజీ ఎంపీటీసీ తమ్మల రమేష్ అన్నారు. వివేకానంద యువజన సంఘం సౌజన్యంతో ఆర్‌వీఎం ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో శుక్రవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 95 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 27మందికి ఆపరేషన్ నిమిత్తం ఆర్‌వీఎం ఆస్పత్రిలో ఉచిత చికిత్సకు రిఫర్ చేశామన్నారు.

● చిన్నశంకరంపేట, సెప్టెంబరు 27: మండలంలోని వెంకట్రావుపల్లిలో శుక్రవారం మెడిసిటీ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్, చెవి, ముక్కు, గొంతు తదితర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైనవారికి ఉచిత మందులు పంపిణీ చేశారు.